సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం, 10, జనవరి, 2024



వెల్లివిరిసిన తెలుగు వైభవం
జేఎన్‌టీయూలో మంగళవారం 'తెలుగు భాషా వైభవ' సదస్సు అంగరంగ వైభవంగా జరిగింది.
8లో



కిలో టమాట రూ.16
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.5°/20.2°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు లేపాక్షి మండలంలో మంత్రి పర్యటన
లేపాక్షి: 'పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర భూగర్భ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లేపాక్షి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు పులమతిలో ప్రజలతో మమేకమవుతారు. మానేపల్లి 10.30 గంటలకు, శిరివరం మధ్యాహ్నం ఒంటి గంట, కంచిసముద్రం 2.30, మైదుగోళం 3.30, లేపాక్షి 4.30 గంటలకు మంత్రి పర్యటిస్తారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి పిలుపునిచ్చారు.

22న అయోధ్యకు రండి
- సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌కు రామ జన్మభూమి ట్రస్ట్ ఆహ్వానం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలోనే ప్రఖ్యాత ధార్మిక సంస్థగా పేరుగాంచిన సత్యసాయి ట్రస్ట్‌కు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈమేరకు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌కు రామజన్మభూమి తీర్థ క్షేత్ర సెక్రటరీ జనరల్ చంపత్‌రాయ్ ప్రత్యేక ఆహ్వానం పంపారు. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి సుమారు 30 మంది ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ క్రమంలోనే రత్నాకర్‌కు ఆహ్వానం పలికారు. ఈనెల 21న అయోధ్యకు బయలుదేరనున్నట్టు రత్నాకర్ తెలిపారు. తనకు ప్రత్యేక ఆహ్వానం పంపడం ఆనందంగా ఉందన్నారు.

విస్తృతంగా 'సెబ్' దాడులు



పట్టుబడిన మద్యం చూపుతున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లావ్యాప్తంగా సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) దాడులు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం దాడులు నిర్వహించి 6 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సీకేపల్లి సెబ్ స్టేషన్ పరిధిలో 110 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం సెబ్ స్టేషన్ల పరిధిలో 177 కర్ణాటక మద్యం ప్యాకెట్లు,3 ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. కేసులు నమోదు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: వైద్యరంగంలో ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ధర్మపురి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష–2' వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఆరోగ్య శ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం 320 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

పకడ్బందీగా 'ఫ్యూచర్ స్కిల్స్'
పుట్టపర్తి: 8, 9 తరగతి విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ (భవిష్యత్తు నైపుణ్యాలు)పై శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల నుంచి డీఈఓ మీనాక్షి ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ పాఠశాల దశలోనే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని సీఎం వైఎస్ జగన్ సంకల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8,9 తరగతులు చదివే విద్యార్థులకు డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇంజినీరింగ్ 4వ సంవత్సరం చదివే విద్యార్థులతో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టిందన్నారు. సీఎం ఆదేశాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆదేశించారు.

సామాజిక చైతన్య ఝురి

అణచివేతకు లోనై, గుర్తింపునకు నోచుకోని బడుగులకు జగనన్న పాలనలో న్యాయం జరిగింది. స్థానిక సంస్థల నుంచి చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించింది. నామినేటెడ్ పదవుల్లోనూ సింహభాగం అవకాశం కలిగింది. సంక్షేమ పథకాల ద్వారానూ ఆర్థిక చేయూత దక్కింది. సామాజిక సమతుల్యత పరిఢవిల్లింది. ఆ ఫలాలను అందుకున్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ వర్గాలు గుంతకల్లులో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చి సింహనాదం చేశాయి. తమ గుండెల్లో కొలువైన జగన్‌కు జై కొట్టాయి.

గుంతకల్లులో మంగళవారం సామాజిక సాధికార యాత్ర సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం



- గుంతకల్లులో పోటెత్తిన జనం
- జగన్ నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణం
- సామాజిక సాధికార బస్సు యాత్రతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



రాజన్న చిత్రపటంతో సందడి చేస్తున్న యువకుడు



సభలో మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

గుంతకల్లు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం గుంతకల్లులో జరిగింది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బస్సు యాత్రలో ఎంపీలు నందిగం సురేష్, తలారి రంగయ్య, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు ఆలీ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పార్లమెంటు సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ పాల్గొన్నారు. బీరప్ప సర్కిల్ నుంచి మస్తానయ్య దర్గా, ఆర్టీసీ బస్టాండ్, పొట్టిశ్రీరాములు సర్కిల్, మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ విగ్రహం వద్ద వరకు బస్సు యాత్ర సాగింది. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల నుంచి తరలివచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అభిమానులు దారిపొడవునా వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్‌లో సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం చేసిన మేలును వివరించినపుడు సభా ప్రాంగణం ఈలలు, కేకలతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బస్సు యాత్ర విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, ఎంపీపీ మాధవి, గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, పామిడి ఎంపీపీ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



మధ్యవర్తులు లేరు, కమీషన్లు లేవు, లంచాలు లేవు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. దాదాపు రూ.4 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.1,700 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతి ఒక్కరూ ఈ విషయాలు గుర్తు చేసుకొని ఫ్యాన్‌కు ఓటు వేయాలి.
– తలారి రంగయ్య, ఎంపీ

ప్రజా సంక్షేమమే పరమావధి



ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన సాగిస్తున్నారు. గుంతకల్లు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు, పాలిటెక్నిక్ కళాశాల, ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుతోపాటు కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.
– వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి



గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుకే పరిమితం చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసింది. సంక్షేమ పథకాలు, పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో సామాజికంగా, ఆర్థికంగా ఎదిగారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం.
– శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట



బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారు. సంక్షేమ పథకం అందని కుటుంబమంటూ ఏదీ లేదు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడ్డారు. మాయ మాటలతో ఓట్ల కోసం వస్తున్న చంద్రబాబును ఎవరూ నమ్మవద్దు.
– బోయ గిరిజమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



ప్రసంగిస్తున్న ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ విద్యారమ

పుట్టపర్తి అర్బన్: ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని శ్రీకాళహస్తి ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల ఏఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ రాజ్ ఏఈలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకూ సాధించిన అభివృద్ధిని సుస్థిర పరచడంతో పాటు వచ్చే సంవత్సరానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం 9 అంశాలను నిర్దేశించిందన్నారు. లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రణాళిక తయారీకి గ్రామ సభ ఏర్పాటు చేసి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఫ్రంట్ లైన్ వర్కర్లకు శిక్షణ, కార్యాచరణ కమిటీ, 'ఈ గ్రాం స్వరాజ్' వెబ్ పోర్టల్‌లో వివరాల నమోదు, ముసాయిదా ప్రణాళిక తయారీతో పాటు ప్రజా మోదం కోసం రెండో సారి గ్రామ సభ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఎల్‌పీఓలు శివకుమారి, అంజినప్ప, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల
అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20), నాల్గో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు జరిగిన తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడం రికార్డుగా ఆయన అభివర్ణించారు. ఇందుకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ డి.లలితకుమారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ భాలనరసయ్య, డాక్టర్ కె.భారతి, డాక్టర్ రామశేఖరరెడ్డి, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ శైలాకుమారి పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ వేగవంతం
- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి రెవెన్యూ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చట్టప్రకారం లబ్ధిదారులకు భూయాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. నిబంధనలను పక్కాగా అమలు చేయాలన్నారు. అసైన్డ్ భూమికి అనుకొని వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు కేటాయించి ఉంటే వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. అసైన్డ్ చేసి 20 ఏళ్లు పూర్తయిన వాటిని 22ఏ నుంచి తొలగించాలన్నారు. జలవనరులు, పోరంబోకు, రస్తా భూముల వివరాలు సేకరించాలన్నారు. అసైన్డ్‌దారు పేరు ఏ రికార్డులో ఉన్నా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వీఆర్‌ఓలు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ వెరిఫికేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, కలెక్టరేట్ అధికారి ఆనంద్, డీటీలు క్రాంతి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో కంది కొనుగోలు
మార్క్‌ఫెడ్‌తో పాటు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కందులు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో వ్యవసాయ శాఖ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలతో పోల్చి మరికొంత ప్రీమియం పెంచే వెలుసుబాటు కల్పించినట్లు చెప్పారు. అన్నదాతలు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి పంట అమ్మకానికి సమ్మతి తెలియజేయాలన్నారు. సదుపాయాలు, కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కంది రైతుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కల్లంలో పట్టు కూలీ, లోడింగ్, రవాణా ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ అశ్వర్థ నాయక్, డీఎస్‌ఓ వంశీక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు.. నీటిమీద రాతలే



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో హిందూపురం అసెంబ్లీ, పార్లమెంటు సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మ



పూలకుంట సభలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, ప్రజలు

- ఓటుకు నోటు కేసులో అడ్డంగా బుక్కై పారిపోయిన ఘనుడు బాబు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

హిందూపురం: చంద్రబాబు చెప్పే మాటలు నీటి మీద రాతల్లాంటివని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ప్రజలు అతడిని నమ్మి ఓటేస్తే అభివృద్ధిలో మరో పదేళ్లు వెనక్కు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. హిందూపురం మండలంలో రెండో రోజు కూడా మంత్రి పర్యటించారు. పార్లమెంట్, అసెంబ్లీ సమన్వయకర్తలు బోయ శాంతమ్మ, టీఎన్ దీపికతో కలిసి పూలకుంట, కగ్గల్లు, మనేసముద్రం, మలూగురు, బీరేపల్లి, చలివెందుల, బాలంపల్లి గ్రామ పంచాయతీలను మంగళవారం ఆయన పర్యటించారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా వైఎస్ జగన్ చేసిన పాదయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. రాచేపల్లిలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. చౌళూరు పంచాయతీలో సర్పంచ్ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ఓటుకు నోటు' కేసులో అడ్డంగా బుక్కై రాత్రికి రాత్రే చంద్రబాబు కరకట్టపైకి పారిపోయి వచ్చాడన్నారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని నాశనం చేయడమే కాకుండా అమరావతిలో రాజధాని పేరిట రూ.కోట్లు ఖర్చు చేసి లీకు బిల్డింగులు కట్టాడన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన మహానుభావుడంటూ దుయ్యబట్టారు.కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన బావ చంద్రబాబు, లోకేష్‌లు హైదరాబాద్‌లో నాలుగు గోడల మధ్య దాక్కున్నారని గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి బూటకపు మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, ఇంటికో ఉద్యోగం, రైతుకు ట్రాక్టర్, డ్రైవర్ ఉంటే ఆ జీతం కూడా తానే ఇస్తానంటూ జనం చెవిలో పూలు పెట్టేందుకు యత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మాటపై నిలబడే వ్యక్తి జగన్..
సీఎం వైఎస్ జగన్ చెప్పాడంటే చేసి చూపుతాడని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. కరోనా వంటి ఆపత్కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించారన్నారు. నాణ్యమైన మందులు, బెడ్లు, పౌష్టికాహారం సమకూర్చి ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. ఎన్ని కష్టాలున్నా 99.5 శాతం హామీలు పూర్తి చేశారన్నారు.



చలివెందలలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

మనసున్న మారాజు జగనన్న..
బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేసి హృదయానికి హత్తుకున్న మనసున్న మారాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని హిందూపురం అసెంబ్లీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ పేర్కొన్నారు. గతంలో హిందూపురంలోని లేపాక్షి రహదారిలో పాత బ్రిడ్జిలు వర్షాలకు కూలిపోయి రాకపోకలు స్తంభించినా ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టించుకోలేదన్నారు. ఈ విషయాన్ని తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే వెంటనే బ్రిడ్జిల నిర్మాణం చేపట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకుడు ఈశ్వర్ రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, దివంగత రామకృష్ణ రెడ్డి సతీమణి జ్యోత్స్నరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మహేంద్ర రెడ్డి, పట్టణ ఏబీ కన్వీనర్లు సాదిక్, నరేష్, కన్వీనర్ రాము, ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రఘునాథ రెడ్డి, సర్పంచ్ ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, ఆర్‌కే ఖలీల్, శ్రీరాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుకాణంలో చోరీ


దుకాణం వెనుక డోరు పగలగొట్టిన దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారి పల్లి క్రాస్‌లో సోమవారం రాత్రి బెస్త నారాయణమ్మ అనే మహిళకు చెందిన దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం వెనుక వైపు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దుకాణంలో ఉంచిన లక్షా ఆరు వేల రూపాయల నగదుతో పాటు 70 వేల విలువ చేసే సిగరెట్ ప్యాక్ బండిల్‌ను దొంగలు అపహరించుకెళ్లినట్లు బాధితురాలు వాపోయింది.

జెడ్పీటీసీపై దాడికి యత్నం

సోమందేపల్లి: స్థానిక జెడ్పీటీసీ అశోక్‌తో పాటు అతని సోదరుడు మారుతీపై కొందరు యువకులు కొడవళ్లతో దాడికి యత్నించిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. జెడ్పీటీసీ అశోక్ ఇంటి వద్దకు కొందరు యువకులు కొడవళ్లతో వచ్చి వారితో వాగ్వాదానికి దిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అయితే దాడికి ఎందుకు ప్రయత్నించారో తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని జూలకుంటలో కుటుంబ కలహాలతో చంద్రశేఖర్ (38) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... ఆరేళ్ల క్రితం జూలకుంట గ్రామానికే చెందిన వనజతో చంద్రశేఖర్‌కు వివాహం జరిగింది. కుటుంబ కలహాల కారణంగా మూడు నెలల నుంచి భార్య కాపురానికి రాలేదు. దీంతో చంద్రశేఖర్ మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్ కుమార్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వెల్లివిరిసిన 'తెలుగు' వైభవం

- ఘనంగా 'తెలుగు భాషా వైభవ' సదస్సు
- జిల్లా సాహితీ దిగ్గజాలకు సేవా పురస్కారాలు
- సాహిత్యంతో సమాజ రుగ్మతలను రూపుమాపాలని వక్తల పిలుపు


మాట్లాడుతున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు


సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

అనంతపురం/అనంతపురం కల్చరల్: స్థానిక జేఎన్‌టీయూ (ఏ) ఆడిటోరియంలో మంగళవారం 'తెలుగు భాషా వైభవ సదస్సు' అంగరంగ వైభవంగా సాగింది. జిల్లా సాహిత్య చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయబాబు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న రుగ్మతలను సాహిత్యమనే ఔషధంతో రూపుమాపాలన్నారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితోనే తెలుగు భాషా వైభవ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి జిల్లా సాహిత్య ఔన్నత్యాన్ని చాటేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లావాసుల సాహిత్య కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందిస్తోందన్నారు. సంకుచిత భావంతో ఎవరూ తప్పు పట్టరాదని హితవు పలికారు. కొత్తపల్లి సురేష్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, ఆర్ఐఓ సురేష్‌బాబు, డీఈఓ నాగరాజు, డీవీఈఓ వెంకటరమణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు..

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా వివిధ అంశాలను స్పృశిస్తూ ప్రసంగాలు సాగాయి. జిల్లా సాహిత్య విశిష్టతపై డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, పద్యంపై డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్, ఆధునిక కవిత్వంపై డాక్టర్ అంకే శ్రీనివాస్, నవలపై డాక్టర్ కె.నాగేశ్వరాచారి, కథానికపై డాక్టర్ బావికాటి రాఘవేంద్ర, జజానపదంపై డాక్టర్ శివణ్ణ, నాటకం- బళ్లారి రాఘవ అనే అంశంపై గుత్తా హరిసర్వోత్తమనాయుడు, సాహిత్య విమర్శపై డాక్టర్ ఏ.ఏ. నాగేంద్ర, సాహిత్యంలో హాస్యం అనే అంశంపై గుంటి మురళీకృష్ణ ప్రసంగించారు.

పురస్కారాల ప్రదానం..

'తెలుగు భాషా వైభవ సదస్సు'లో జిల్లాకు చెందిన పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య మూడే గోనా నాయక్, కంబదూరు షేక్ నబీరసూల్, చొప్పా వీరభద్రప్ప, లక్ష్మీజయరాజ్, జెట్టీ జైరాం, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణప్రసాద్, డాక్టర్ కేతు బుచ్చిరెడ్డి, డాక్టర్ కల్లూరు ఆనందరావు, శాంతి జయప్రకాష్‌కు జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. మరో 40 మందికి సేవా ప్రతిభ అవార్డులు అందించారు.

ఆకట్టుకున్న 'జయహో శ్రీకృష్ణదేవరాయ'

అధికార భాషా సంఘం అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న విజయబాబు రచించిన 'జయహో శ్రీకృష్ణ దేవరాయ' కళారూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శ్రీకృష్ణదేవరాయలుగా సినీనటుడు కౌశిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కళాకారులు, కవులను అధికారులు సత్కరించారు.

పండ్ల తోటలతో కరువుకు చెక్

- జిల్లాలో 11,700 ఎకరాల సాగే లక్ష్యం
- ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప


మాట్లాడుతున్న జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప

పుట్టపర్తి అర్బన్: 'జిల్లాలో కరువును పారదోలడానికి పండ్ల తోటల పెంపకం ఎంతో ఉపయోగకరం. ప్రతి మండలంలోనూ ఈ ఏడాది పండ్ల తోటల పెంపకాన్ని విస్తారంగా చేపట్టాలి'. అని జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఉద్యానశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని 32 మండలాలకు 2024-25 సంవత్సరానికి 11,700 ఎకరాల సాగు విస్తీర్ణాన్ని లక్ష్యాన్ని నిర్ణయించామని, సిబ్బంది ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని ఈ మండలాల్లో మండలానికి 400 ఎకరాలు, తక్కిన 11 మండలాల్లో 300 ఎకరాల చొప్పున పండ్ల తోటల సాగును పెంచాలన్నారు. ఈ వేసవిలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడానికి ఇది మంచి మార్గమన్నారు. రైతులు 5 ఎకరాలలోపు మెట్ట భూమి, 2.5 ఎకరాల లోపు మాగాణి ఉన్న చిన్న, సన్న కారు రైతులు అర్హులన్నారు. ప్రతి రైతుకూ కచ్చితంగా ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి పెద్ద ఎత్తున సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు.

అందుబాటులోకి 'జెడ్పీ ప్రత్యేక వెబ్‌సైట్'



అనంతపురం సిటీ: జెడ్పీలో పారదర్శకత కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించినట్లు ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకునే క్రమంలో https:// zpananthapuramu. ap. gov. in వెబ్‌సైట్ రూపొందించినట్లు వివరించారు. పది అంశాలను ప్రధానంగా తీసుకొని వెబ్‌సైట్ రూపొందించామన్నారు. జెడ్పీ గురించి, జెడ్పీ కో–ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యుల సమాచారం, స్థాయీ సంఘాల వివరాలు, ఇప్పటి వరకు జరిగిన సర్వసభ్య సమావేశాల మినిట్స్, ప్రతి ఏడాది రూపొందించే బడ్జెట్ అంచనాలు, జెడ్పీ నుంచి విడుదలయ్యే నిధులు, చేపట్టిన పనులు, చెల్లింపులు, సిబ్బంది వివరాలు, వారి విధులు, సమాచార హక్కు చట్టం, ముఖ్యమైన అధికారుల వివరాలతో పాటు ఫోన్ నంబర్లు, పనుల పర్యవేక్షణ వంటి కీలక అంశాలన్నీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. వర్క్ మానిటరింగ్ సిస్టం (డబ్ల్యూఎంఎస్)కు సంబంధించి జెడ్పీటీసీ సభ్యులు, ప్లానింగ్/అకౌంట్స్ సెక్షన్లు, పీఆర్/ఆర్‌డబ్ల్యూఎస్, అనంతపురం/శ్రీసత్యసాయి జిల్లాల వారికి, డిప్యూటీ సీఈఓ, సీఈఓ, జెడ్పీ చైర్‌పర్సన్‌కు వేర్వేరు లాగిన్లు ఇచ్చినట్లు సీఈఓ తెలిపారు. పనులకు సంబంధించిన ప్రతిపాదనలను నేరుగా జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ లాగిన్‌కు వచ్చేలా వెబ్‌సైట్ రూపొందించామన్నారు. తరువాత వాటికి అంచనాలు రూపొందించి తదుపరి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. పనుల స్థితిగతులను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ కార్యాలయానికి రాకుండానే ఆన్‌లైన్ పద్ధతిలో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.



అఫర్వాట్ శిఖరంపై 'వన్స్‌మోర్ జగనన్న జెండా'



పర్వతంపై వన్స్‌మోర్ జగనన్న జెండాతో షేక్ షాషు

బత్తలపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న అఫర్వాట్ శిఖరంపైన వన్స్‌మోర్ జగనన్న జెండా రెపరెపలాడింది. సముద్ర మట్టానికి 13,999 అడుగుల ఎత్తులోని ఈ పర్వతాన్ని మంగళవారం బత్తలపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకుడు షేక్ షాషు అధిరోహించి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నవరత్నాలతో రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ పర్వతాన్ని అధిరోహించినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని, వారిపైన ఉన్న అభిమానంతో 13,999 అడుగుల ఎత్తులోని పర్వతంపైకి చేరుకుని జెండాను ఎగురవేసినట్లు వివరించారు.

జిల్లా హాకీ జట్టు ఎంపిక


జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టుతో హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్

ధర్మవరం అర్బన్: జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేసినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా జట్టును ఎంపిక చేశామన్నారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకూ తిరుపతిలో జరగనున్న 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీల్లో జిల్లా హాకీ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టుకు కోచ్‌గా హుసేన్, మేనేజర్‌గా షెక్షావలి, టోర్నమెంట్ అంపైర్‌గా సాయికుమార్ వ్యవహరిస్తారన్నారు.

ఎంపికైన జట్టు

మహమ్మద్ రఫీ (కెప్టెన్), జగన్, ఈశ్వర్, మహబూబ్‌బాషా, బాల ఓబిలేసు, భరత్‌కుమార్, మనోజ్‌కుమార్, అభిషేక్, అనిల్‌కుమార్, దుర్గాప్రసాద్, లవన్‌కుమార్, దయాసాగర్, ఫజులుద్దీన్, శబరీష్‌గౌడ్, రితీష్, వెంకటసాయి అభిషిక్త్, గవ్వల మధులు.

జనవాక్కు

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు



కడుపు పుట్టిన బిడ్డలు పట్టించుకోకపోయినా సీఎం జగన్ ప్రతి నెలా పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నాడు. అధికారంలోకి రాగానే పింఛన్ రూ.2,750కి పెంచి. ఏటా పెంచుతూ ప్రస్తుతం రూ.3 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది. ఏ సహాయంలేని మాలాంటి వారి జీవితాన్ని నిలబెడుతున్న ముఖ్యమంత్రి జగన్ చిరకాలం చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను. కరోనా కష్ట కాలంలో కూడా నాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ అందచేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది.

– సులోచనమ్మ, వళారం, గుడిబండ

అర్హులకు న్యాయం



మొదట నాకు వికలాంగ పింఛన్ వచ్చేది. అయితే టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తొలగించారు. కంటి చూపు కనబడకపోయినా పింఛన్ మాత్రం అందలేదు. సదరంలో ఆన్‌లైన్‌లో అనర్హుడిగా నమోదు చేశారు. అయితే ప్రస్తుతం సమస్యను వలంటీర్‌కు తెలిపి మరోమారు సదరంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ మంజూరు కావడంతో నెల నెలా ఇంటి వద్దకే వచ్చి రూ.3000 పింఛన్ అందిస్తున్నారు. అర్హత ఉంటే సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు కూడా సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– పులి శ్రీనివాసరెడ్డి, రామసాగరం, బెళుగుప్ప

ఆర్థిక ఇబ్బందులు తీరాయి



కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచింది. ఇటీవల నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నాకు వితంతు పింఛన్ మంజూరు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– జయమ్మ మధూడి, అగళి మండలం

ఎన్నికల సన్నద్ధతపై సమీక్షలో కలెక్టర్, ఎస్పీ


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి సాక్షి: సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధత, ఓటరు జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ సంబంధించి వివిధ అంశాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ విజయవాడలోని ఓ హోటల్‌లో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొని జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామానికి వెళ్లే గుడిబండ ప్రధాన రోడ్డు మలుపు (కరేకల్లు గేట్) వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొళ్లవడ్రహట్టికి చెందిన టైలర్ హనుమంతరాయప్ప (40) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు... రొళ్లవడ్రహట్టికి చెందిన హనుమతరాయప్ప రొళ్ల పట్టణం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన టైలర్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. హనుమతరాయప్ప గుడిబండ మండలం మందలపల్లి వడ్రహట్టిలో వివాహం చేసుకున్నారు. అత్తారింటికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా ద్విచక్ర వాహనంలో వచ్చిన వ్యక్తి ఢీ కొన్నాడు. హనుమతరాయప్ప తలకు బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందారు. మరోవ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్లిన ప్రయాణికులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రొళ్ల, గుడిబండ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య అశ్వత్థమ్మ ఉంది. హనుమంతరాయప్ప హఠాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు.